సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 28.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 216
పేజీలు: 08 వెల: రూ. 5

## ఈసీ.. ఎస్ఐఆర్ నిర్వహించొచ్చు

**ఆర్టికల్ 324 ప్రకారం పూర్తి అధికారాలు ఉన్నాయి**

ఖచ్చితమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు సర్ ముందడుగు
సుప్రీంకోర్టు కీలక తీర్పు

03



## లారీలు పంపరు.. ధాన్యం కొనరు

**ధాన్యం కొనుగోలు లేక రోడ్డెక్కిన జనగాం రైతులు**

03

- వడ్ల కొనుగోలు ఆలస్యంపై రైతుల ఆగ్రహం
- మంబాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో
- ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమస్య పరిష్కారానికి కృషి




## కొనుగోళ్లు చేతకాకపోతే కేంద్రానికి లేఖ రాయండి

**సరైన ప్రణాళిక లేకపోవడంతోనే అస్తవ్యస్తం: బండి సంజయ్**

- ధాన్యం కొనుగోళ్లలో ఫెయిల్..
- రైతులు అరిగోస పడుతున్నారు
- తడిసిన ధాన్యంతో రైతుల దోపిడి..
- నెలాఖరులోగా పూర్తి చేయాలి
- సీఎం-మంత్రుల్లో సమన్వయం లేదు..
- విధ్వంసమే బీఆర్ఎస్ ధ్యేయం..
- బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

03



## అప్రమత్తంగా ఉండండి

**భారీ వర్షాలపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం**

- ధాన్యం తడవకుండా టార్పాలిన్ల ఏర్పాటుకు సీఎం ఆదేశాలు
- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఈదురుగాలులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచనలు
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం

02



## గురుకులాల స్థాయిలో సిద్ధం కావాలి



రాబోయే విద్యా సంవత్సరంలో ప్రారంభించాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

- గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ కావాలి
- నిర్లక్ష్యానికి తావులేదు
- సీట్లు భర్తీ కాని పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలి
- వైద్యులు ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి
- గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్ష

03

## పోలీసుల అదుపులో బండి భగీరథ్

మూడు రోజులు విచారించనున్న పేట్ బషీరాబాద్ పోలీసులు

కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో విచారణ

03





## దూకుడే ఆయుధమా..

**బీఆర్ఎస్‌కు అదే బలహీనతా?**

- బీఆర్ఎస్ యువ నేతలది ఒకే రాగం
- కేటీఆర్ ను చూసి ఒకరి వెనక ఒకరు
- పార్టీకి లాభమా.. నష్టమా
- తాజాగా బాల్క సుమన్.. గతంలో కౌశిక్ రెడ్డి
- ఆవేశ రాజకీయాలు పార్టీకి మైలేజీ ఇస్తున్నాయా?
- ప్రభుత్వ వ్యతిరేకతను క్యాష్ చేసుకోలేకపోతున్న బీఆర్ఎస్
- యువనేతల వ్యాఖ్యలతో డిఫెన్స్‌లో పడుతున్న గులాబీ పార్టీ
- ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం?
- బీఆర్ఎస్‌లో హుందాతనం తగ్గుతోందా అనే చర్చ
- దూకుడు పెరిగే కొద్దీ పార్టీకి పెరుగుతున్న ఇబ్బందులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** అధికారంలో ఉన్నప్పుడైనా.. విపక్షంలో కొనసాగుతున్నప్పుడైనా బీఆర్ఎస్ యువ నేతలు దూకుడు పెంచుతున్నారు. రాజకీయమైన దూకుడు కావడంతో.. అది పార్టీకి ప్లస్సా.. మైనస్సా అనేది ఎవరికీ అర్థం కావడం లేదు. కానీ, మధ్య వర్గాల్లో మాత్రం కేటీఆర్ దూకుడే నచ్చడం లేదు. ఇలాంటి సమయంలో ఇప్పుడు కొంతమంది యువ నేతలు అదే దారి తొక్కుతున్నారు. నిజానికి, రాజకీయాల్లో దూకుడు ఉండాలి, కానీ అది ప్రజల్లో విశ్వసనీయతను పెంచేలా ఉండాలి తప్ప.. ఆవేశంతో పార్టీని ఆత్మరక్షణలో పడేసేలా ఉండకూడదని రాజకీయ విశ్లేషకులు చెప్తుతుంటారు. కానీ, బీఆర్ఎస్ కు తమ దూకుడు కలిసి వస్తుందా.. కలిసి వచ్చే సమయంలో మరింత వెనక్కి లాగుతుందా అనేది ఆయోమయంలోనే ఉంటోంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న తీరు, చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి మైలేజీని ఇవ్వడం కంటే వివాదాలకే ఎక్కువ దారితీస్తున్నాయి.

**దూకుడునే నమ్ముకుంటున్న బీఆర్ఎస్ యువనేతలు**

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి పరిస్థితి కత్తి మీద సాము లా మారింది. పదేళ్ల మిగతా 02లో

## వైభవ్ అరాచకం

**29 బంతుల్లో 97..**

- వైభవ్ తుఫాన్‌కు హైదరాబాద్ బౌలర్లు బెంబేలెత్తారు
- క్రిస్ గేల్ రికార్డ్ తృటిలో మిస్..
- కానీ ఐపీఎల్‌ను షేక్ చేసిన సూర్యవంశీ
- కమిన్స్ ప్లాన్స్ ఫెయిల్.. వైభవ్ బ్యాట్ నుంచి సిక్సర్ల సునామీ
- 12 సిక్సర్లతో చరిత్ర సృష్టించిన 15 ఏళ్ల చిచ్చరపిడుగు

-ముద్ర డెస్క్ : ఐపీఎల్ ప్లే-ఆఫ్స్ ఉత్కంఠలో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ సిక్సర్ల సునామీ సృష్టించాడు. హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వేసిన ముందస్తు వ్యూహాలను తుత్తునియలు చేస్తూ.. కేవలం *29* బంతుల్లో *12* సిక్సర్లు, *5* ఫోర్లతో *97* పరుగులు సాధించి సన్‌రైజర్స్ బౌలింగ్ లైనప్‌ను కుదిపేశాడు. తృటిలో సెంచరీ చేజార్చుకుని క్రిస్ గేల్ వేగవంతమైన శతక రికార్డును మిస్ అయినప్పటికీ, ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన 'యూనివర్సల్ బాస్' *14* ఏళ్ల నాటి రికార్డును ఈ *15* ఏళ్ల చిచ్చరపిడుగు బద్దలు కొట్టాడు.





## కన్నడ రాజకీయం

**రాజ్యసభకు సిద్దరామయ్య**

- సీఎంగా డీకే శివకుమార్!
- డిప్యూటీ సీఎం పేరు తెరపైకి తెచ్చిన సీఎం
- కాంగ్రెస్‌లో పవర్ షిఫ్ట్
- ఢిల్లీలో కాంగ్రెస్ కీలక నిర్ణయం
- డీకే వాదనకు హైకమాండ్ ఓకే?
- కర్ణాటకలో కొత్త సమీకరణాలు
- డీకే సీఎం.. యతీంద్ర డిప్యూటీ సీఎం?

02



## పసుపు జెండా ఆత్మవిశ్వాసం

**మహిళలకు అంకితంగా మహానాడు**

- సంస్కరణలకు నాంది టీడీపీదే
- టీడీపీ మహానాడులో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు



**అమరావతి, ముద్ర:** జాతీయ జెండా దేశానికి గౌరవమైతే.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రెండ్రోజుల పాటు జరుగుతున్న టీడీపీ మహా నాడు ప్రారంభ సభలో ఆయన పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. వాహనాల జోరు తగ్గినా కార్యకర్తల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్నారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన ఏకైక ప్రాంతీయ పార్టీ టీడీపీ అని కొనియాడిన చంద్రబాబు.. సంస్కరణలు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమేనన్నారు. మిగతా 02లో

### మహిళలకు 33శాతం సీట్లు

**మహానాడులో చారిత్రాత్మక తీర్మానాన్ని ప్రవేశపెట్టిన లోకేష్**

వచ్చే ఎన్నికల నుంచే అమల్లోకి 02

- మహిళా సాధికారిత.. అదే నినాదం
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్




ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 28.05.2026
www.mudranews.in | @mudranews



### నిత్య వ్యాయామం, శారీరక చలనం



క్రమం తప్పకుండా నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఇది కండరాల బలాన్ని, మెదడు పని తీరును మెరుగుపరచడమే కాకుండా అకాల మరణాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### పసుపు జెండా తెలుగువారి
# ఆత్మవిశ్వాసం



(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పుట్టుక నుంచి ప్రతి ఎన్నిక, ప్రతి విజయమూ సంచలనమేనని వ్యాఖ్యానించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. మహిళా సాధికారతకు టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టం చేసిన సీఎం.. ఈసారి మహానాడును మహిళలకు అంకితం చేశామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'తల్లికి వందనం' వంటి పథకాలతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించి చరిత్ర సృష్టించామని గుర్తుచేశారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, ఉద్యోగాలే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్ల రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని, 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల ఉద్యోగాలు సాధ్యమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశకు చేరుకున్నాం" అని అన్నారు.

# దూకుడే ఆయుధమా..

(మొదటి పేజీ తరువాయి)

అధికారానికి దూరం కావడాన్ని జీర్ణించుకోలేకనో లేక పట్టు కోల్పోతామన్న భయమో కానీ, పార్టీలోని కీలక యువనేతలు అనవసరమైన ఆవేశంతో వివాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ తర్వాత హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి.. ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వంటి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలు, హింసాత్మక పిలుపులకే మీడియాలో ప్రాధాన్యత లభిస్తుండటంతో.. పార్టీ అసలు ఎజెండా పక్కదారి పడుతోంది.

**దూషణలకు దిగుతున్న కేటీఆర్**

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి చేస్తున్న కొన్ని వ్యాఖ్యలు హుందాగా లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బండి సంజయ్ కుమారుడికి సంబంధించిన కేసులను ప్రస్తావించడం, సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా ఆయన సొంత పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపవచ్చు కానీ, తటస్థ ఓటర్లలో మాత్రం ప్రతికూలతను పెంచుతున్నాయి. కేటీఆర్ ప్రజా సమస్యలపై, హామీల అమలుపై చేస్తున్న పోరాటం కూడా ఈ వివాదాస్పద వ్యాఖ్యల వెనుక మరుగున పడిపోతోంది. రాజకీయాల్లో ఆలోచనకు ఉన్న విలువ ఆవేశానికి ఉండదు అనే సత్యాన్ని యువ నాయకత్వం విస్మరిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన తాజా వ్యాఖ్యలు బీఆర్ఎస్‌ను మరింత ఇరకాటంలో పడేశాయి. మిలిటెంట్ తరహాలో దాడులు చేద్దాం, ప్రభుత్వ కార్యాలయాలను తగులబెట్టండి అంటూ ఆయన ఇచ్చిన పిలుపు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. సింగరేణి ప్రాంతంలో రాజకీయ పట్టు నిలుపుకోవడం కోసం ఇలాంటి హింసాత్మక రాజకీయానికి తెరలేపడంపై మేధావి వర్గం తీవ్రంగా మండిపడుతోంది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి ప్రజా ఆస్తుల ధ్వంసానికి పిలుపునివ్వడం అంటే ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలిపెట్టని భావిస్తున్నారు.

**తప్పంటున్న విశ్లేషకులు**

ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది ముందు నుంచీ ప్రతి ఒకరిలో వస్తున్న సమాధానం. కానీ, పార్టీలోని సీనియర్ నేతలు మౌనంగా ఉండగా, యువనేతలు మాత్రం మీడియా అటెన్షన్ కోసం చేస్తున్న ఈ అతి దూకుడు పార్టీని ప్రజలకు దూరం చేస్తోంది. ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిందే, కానీ అది నిర్మాణాత్మకంగా ఉండాలని తీరిగ్గా చెప్పే నేతలు బీఆర్ఎస్ యువ నేతలకు కనిపించడం లేదు. ఒక వేళ చెప్పాలని ఉన్నా.. ఈ యువ నేతలు వారిని పట్టించుకునే అవకాశమే లేదు. ఇప్పటికే రాజకీయపరంగా హుం దాతనాన్ని కోల్పోవడం వల్ల కేటీఆర్ వంటి నేతల క్రెడిబిలిటీ దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో అసలు సమస్య పక్కకు వెళ్లి.. వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నట్లు మారింది.

**వ్యతిరేకతను ఎందుకు అనుకూలం కావడం లేదు..**

నిజానికి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో కొంత మేరకు రాజకీయపరంగా వ్యతిరేకత కనిపిస్తోంది. కానీ, దానిని పట్టుకోవడంలో బీఆర్ఎస్ విఫలం కూడా అంతే స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవాల్సిన బీఆర్ఎస్, తన వివాదాస్పద వ్యాఖ్యలతో ప్రభుత్వానికి ఎదురుదాడి చేసే అవకాశం ఇస్తోంది. బాల్క సుమన్ వ్యాఖ్యల వల్ల పోలీసులు కేసులు పెట్టడం, జైలుకు పంపడం వంటి పరిణామా లు పార్టీకి సానుభూతిని తీసుకురావడం కంటే హింసావాద పార్టీ అనే ముద్రను వేసేలా ఉన్నాయి. ఇటు కేటీఆర్, కౌశిక్ రెడ్డి వంటి నేతలు కూడా ఏదో చేద్దామని మొదలుపెట్టి.. దూకుడు పెంచితే.. అది చివరకు రివర్స్ గా మారుతోంది. బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటికైనా మేల్కొని యువనేతలకు దిశానిర్దేశం చే యకపోతే, రాబోయే రోజుల్లో పార్టీ కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# మహిళలకు 33శాతం సీట్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడు వేదికపై నుంచి నారా లోకేష్ అతిపెద్ద అనౌన్స్‌మెంట్ చేశారు. తెలుగుదేశం పార్టీ మహిళలకోసం తీ సుకున్న చారిత్రక నిర్ణయాన్ని మహానాడు వేదికపై నుంచి ప్రకటించారు. మహిళా రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా భవిష్యత్‌లో అన్ని ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వు చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న తొలి మ హానాడులో నారాలోకేష్ ఈ తీర్మానా న్ని ప్రతిపాదించారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయని.. కానీ.. తెలుగుదేశం పార్టీ దానితో సం బంధం లేకుండానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని లోకేష్ తెలిపారు."మన స్త్రీశక్తికి మరింత బలం ఇవ్వాలని చూస్తే దానికి ప్రతిపక్షాలు అ డ్డుపడ్డాయి. ఇప్పుడు ఒక ప్రతిపాదన చేస్తున్నాను. పార్లమెంట్‌లో బిల్ పాస్ అయినా, అవ్వకపోయినా మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి.. వచ్చే ఎన్నిక ల్లో 33% సీట్లు మహిళలకు ఇవ్వాలి... ఈ పవిత్ర మహానాడు వేదిక నుండి తాను ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు" నారా లోకేష్ ప్రకటించారు

**మహిళా సాధికారత టీడీపీ విధానం.. నినాదం**

మహిళా సాధికారతను టీడీపీ మాటల్లోనే కాదు చేతల్లో కూడా చూపుతుందని నారా లోకేష్ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును తిరస్కరించి, మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించాయి. ఎన్నికల సమయంలో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడతాయి.. కానీ ఎన్నికల తర్వాత మహిళలను మర్చిపోతాయి. కానీ తెలుగుదేశం విధానం.. నినాదం రెండూ మహిళల అభ్యున్నతే అని చెప్పారు. తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాఠ్య పుస్తకాల్లో మహిళలు ఇంటి పనులు చేస్తున్నట్లుగా ఉన్న ఫోటోలను మార్చి.. మగవారు కూడా ఆ పనులు చేస్తున్నట్లుగా చూపించామని.. ఇంటి నుంచే మ హిళలపై గౌరవం పెరగాలన్నది తమ సిద్ధాంతమని లోకేష్ తెలిపారు

**వచ్చే ఎన్నికల నుంచే అమలు**

రాష్ట్రంలో 2029 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మహిళలకు 33% సీట్లను కేటాయించాలని నిర్ణయించింది. మహిళా సాధికారితకు ప్రాధాన్యం ఇస్తూ తెలుగుదేశం పార్టీ తీసుకున్న అతి పెద్ద చారిత్రక ముందడుగు ఇదని లోకేష్ తెలిపారు. మహిళల అభ్యున్నతి మాటల్లో కాదని చేతల్లోనే చూపిస్తామని చెప్పారు. ."ఇది కేవలం ఒక నినాదంగా కాదు.. భారతదేశ భవిష్యత్తు పట్ల ఒక నిబద్ధతగా ఉండాలి. మాకు మరింత మంది మహిళా చట్టసభ సభ్యులు కావాలి.. మరింత మంది మహిళా నాయకులు కావాలి.. మరింత మంది మహిళా విధాన నిర్ణేతలు కావాలి. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును మహిళలు భుజం భుజం కలిపి నడిపిస్తారు. ఇది మా సం కల్పం.. ఇది మా బాధ్యత.. ఇది మా కమిట్ మెంట్" అని స్పష్టం చేశారు. లోకేష్ తీర్మానం చేసిన తర్వాత మహిళా సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా హాజరైన వారు.. ఆన్‌లై న్ ద్వారా డిజిటల్ విధానంలో హాజరైన వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**మొదటి పార్టీ తెలుగుదేశమే..**

మహిళలకు పార్టీలో రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించడం ద్వారా తెలుగుదేశం ఓ ముందడుగు వేసింది. మహిళలకు సంబంధించి చారిత్రక నిర్ణయాలు తీసుకోవడంలో ఆ పార్టీకి ఇంతకు ముందు కూడా ట్రాక్ రికార్డ్ ఉంది. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిహక్కు కల్పిస్తే.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విద్యాసంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు పార్టీ అభ్యర్థుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా టీడీపీ మరో మందుడుగు వేసింది.



# హైడ్రా మెగా ఆపరేషన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ నగరంలో కబ్జారాయుళ్లకు, అక్రమ నిర్మాణదారులకు హైడ్రా పంజా విసురుతోంది. తాజాగా ఐటీ కారిడార్ పరిధిలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో కోకాపేట, ఖానామెట్, భరత్‌నగర్ పరిసరాల్లోని 4 విలువైన స్థలాలను కబ్జా నుంచి విడిపించింది. దీని ద్వారా ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు భూములను కాపాడి కంచెలు వేసింది. కోకా పేట కొత్తచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని విల్లాల అక్రమ నిర్మాణాలను, ఖానామెట్‌లో మాయం చేయాలని చూసిన ఈదుల కుంట చెరు వును, రోడ్డు విస్తరణకు పరిహారం పొంది మరీ కబ్జా చేసిన స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుంది.

**ఖరీదైన ప్రాంతాల్లో ఆపరేషన్**

హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన, విలాసవంతమైన ప్రాంతంగా పేరొందిన కోకాపేట, ఐటీ కారిడార్ పరిసరాల్లో సాగుతున్న భూకబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. మార్కెట్లో ఎకరా భూమి ధర దాదాపు రూ.150 కోట్ల నుంచి రూ.177 కోట్ల వరకు పలుకుతున్న ఈ ప్రాంతంలో.. పక్కా ప్రణాళికతో చెరువులను, ప్రభుత్వ భూములను మింగేస్తున్న బడా రియల్టర్ల ఆటలను అధికారులు భగ్నం చేశారు. మంగళవారం నగరం వ్యాప్తంగా నాలుగు ప్రధాన ప్రాంతాలలో ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించిన హైడ్రా బలగాలు.. దాదాపు రూ.4117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు భూములకు విముక్తి కల్పించి వాటి చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేశాయి. ఈ విడత ఆపరేషన్‌లో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు చేసిన అక్రమాలు బట్టబయలయ్యాయి. కోకాపేటలోని కొత్తచెరువును లక్ష్యంగా చేసుకుని గోల్డ్‌ఫిష్ కాలనీ పేరుతో వెలిసిన ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ.. చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం పరిధిలోని 1.09 ఎకరాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించింది. అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా.. మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి ఓపెన్ ఏరియాగా మార్చేసింది. ఆ స్థలంలో విల్లా నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, పిల్లల ఆట స్థలాలను నిర్మించింది. వెంటనే రంగంలోకి దిగి ఆ ఆటస్థలాలను, గోడలను పూర్తిగా తొలగించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. అలాగే కోకాపేట పెద్దచెరువు పరిధిలో వివిధ బహుళ అంతస్తుల సంస్థలు ఆక్రమించిన దాదాపు 22 ఎకరాల స్థలాన్ని కూడా కాపాడింది. ఈ ఒక్క ప్రాంతంలోనే కాపాడిన భూమి విలువ రూ.3 వేల కోట్ల పైమాటే అని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. ఐటీ కారిడార్‌లోని శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలో ఉన్న ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే మాయం చేసేందుకు జరిగిన కుట్రను హైడ్రా అడ్డుకుంది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువు నిండితే.. ఆ వరద నీరు కాలువ ద్వారా ఈదులకుంటకు చేరుతుంది. అయితే కబ్జాదారులు పక్కా స్కెచ్‌తో ఆ వరద కాలువను వేరే రూట్‌లోకి మళ్లించి చెరువు ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత స్కైస్క్రాపర్స్ నిర్మాణానికి భూమిని సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదైంది. హైడ్రా అధికారులు శాటిలైట్ చిత్రాలను పరిశీలించి, పాత ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని కాపాడి కంచె వేశారు. దీని మార్కెట్ విలువ దాదాపు రూ.600 కోట్లు ఉంటుంది. దీనికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 11/37లోని మరో 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జారాయుళ్లు సర్వే నంబర్లు మార్చి దక్కించుకోవాలని చూడగా.. హైడ్రా రూ.500 కోట్ల భూమి స్వాధీనం చేసుకుంది. ఇక భరత్‌నగర్ – ఖైతలాపూర్ – హఫీజ్‌పేట్ రహదారి విస్తరణ పరిధిలో మరో కబ్జా వెలుగు చూసింది. రెయిన్ బో విస్టా మీదుగా రైల్వేట్రాక్ వరకు 100 అడుగుల రహదారి నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ గతంలో భూసేకరణ చేపట్టి, ఒక భూయజమానికి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించింది. అయితే సదరు యజమాని డబ్బులు తీసుకున్నప్పటికీ రోడ్డుకు ఇవ్వాల్సిన 1700 గజాల స్థలాన్ని తన కబ్జాలోనే ఉంచుకుని అక్కడ కార్యాలయం, గోశాలను నిర్మించాడు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవడంతో జ్యుయెల్ హైట్ గేటెడ్ కమ్యూనిటీ ముందున్న ఆ అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చింది. రూ.17 కోట్ల విలువైన స్థలాన్ని రోడ్డు విస్తరణకు అప్పగించింది.

# అప్రమత్తంగా ఉండండి: సీఎం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# కన్నడ రాజకీయం



**ముద్ర, నేషనల్ :**

కర్ణాటకలో సీఎం మార్పునకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. సిద్దరామయ్య రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం కానున్నారన్న ప్రచారం జోరందుకుంది. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో, ప్రభుత్వంలో కీలక మార్పులకు కారణమవుతుంది. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నట్లుగా సమాచారం. ఆయనను రాజ్యసభకు రావాలని హైకమాండ్ సూచించిందని.. కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడుతారని కాంగ్రెస్ వర్గాల కథనం.

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత నడుమ నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్ డీకే శివకుమార్, సిద్ధరామయ్యతో రోజంతా చర్చలు జరిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలాతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023లో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీలో భాగంగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చి తీరాలని అగ్రనేతల ముందు డీకే శివకుమార్ మరోసారి తన వాదన వినిపించారు. ప్రతిగా సిద్ధరామయ్య తను సీఎం పదవీ వదులుకోవాల్సి వస్తే ఎస్సీ వర్గానికి చెంది పరమేశ్వర్‌ను సీఎం చేయాలని మెలిక పెట్టారు. అయితే అన్ని వర్గాల వాదనలపై భేటీలో సుదీర్ఘ చర్చ అనంతరం కర్ణాటక సీఎం మార్పుపైన, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైన కాంగ్రెస్ హైకమాండ్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకొని, రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సహకరించాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. అతనికి రాజ్యసభ స్థానంతో పాటు ఆ సభలో విపక్ష నేతగానూ అవకాశం ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది.

**రేపు సిద్దరామయ్య రాజీనామా.?**

అధిష్టానం నిర్ణయం నేపథ్యంలో రేపు బెంగుళూరులో కేబినెట్ మీటింగ్ తర్వాత సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నారు. గురువారం తొలుత సహచర మంత్రులకు అల్పాహార విందు ఇచ్చి, అనంతరం బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. నూతన సీఎం డీకే శివకుమార్ సారధ్యంలోని కేబినెట్ లో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రకు ఉపముఖ్యమంత్రిగానూ అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్యను రాజ్యసభకు ఎంపిక చేయడం ద్వారా ఆయన సేవలు దేశవ్యాప్తంగా పార్టీ కోసం ఉపయోగించుకుంటామన్న రాహుల్ గాంధీ భరోసా నిచ్చినట్లుగా తెలుస్తుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.05.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### సమతుల్య పోషకాహారం

కూరగాయలు, పండ్లు, పూర్తి ధాన్యాలు, పప్పులు, డ్రైఫ్రూట్స్ మరియు ఆరోగ్యకర కొవ్వులు ఉన్న ఆహారాన్ని రోజూ తీసుకోవాలి. ప్రాసెస్డ్ ఫుడ్స్, చక్కెర పానీయాలను పూర్తిగా తగ్గించడం వల్ల దీర్ఘాయుష్షు లభిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.





## వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగించే కుట్ర

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై డిప్యూటీ సీఎం విమర్శలు
- బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా తమకు అనుకూలంగా ఉన్న ఓటర్లను జాబితాలో ఉంచి, వ్యతిరేక ఓటర్లను తొలగించే ప్రక్రియనే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'గా అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఈ ప్రక్రియను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో సమర్థులైన బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, జూన్ 30వ తేదీ లోపు మండల కార్యవర్గ కమిటీలు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని పనిచేయాలని, సామాజిక న్యాయం పాటించాలని అన్నారు. పార్టీ పరంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమన్వయం చేయాలని సూచించిన భట్టి విక్రమార్క, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందనే భరోసా కల్పించాలని అన్నారు. ప్రతి నెల జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, గ్రామాల్లో నాయకులను సమన్వయం చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటామని, పార్టీ అభివృద్ధికి తోడ్పడే వారికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత, వైరా మున్సిపల్ చైర్పర్సన్ కాపా చంద్రకళ, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు చేతకాకపోతే కేంద్రానికి లేఖ రాయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్
- సరైన ప్రణాళిక లేకపోవడంతోనే అస్తవ్యస్తంగా కొనుగోళ్లు

**ముద్ర, కరీంనగర్,:**



ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఈ నెలాఖరు వరకు వడ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దేనికైనా సిద్ధం అని హెచ్చరించారు. అసలు వడ్లను కొంటారా? లేదా? అని నిలదీశారు. మీకు చేతగాకపోతే అదే విషయాన్ని కేంద్రానికి సీఎం లేఖ రాయాలన్నారు. వడ్ల పైసలన్నీ కేంద్రమే ఇస్తుంటే కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. బుధవారం కరీంనగర్ లోని బొమ్మకల్ ఐకేపీ కేంద్రాన్ని బండి సంజయ్ సందర్శించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షానికి తడిసిన వడ్లను బండి సంజయ్‌కు చూపిస్తూ రైతులు వాపోయారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన బండి.. నెల రోజులుగా మొత్తుకుంటున్నా ప్రభుత్వం వడ్లు కొనకుండా రైతులను అరిగోస పెడుతున్నారని సీఎం, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయమే లేదని ఆరోపించారు. తలో మాట చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం పేరుతో పెద్ద ఎత్తున కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడే దుస్థితి ఏర్పడిందని బండి సంజయ్ విమర్శించారు. పంట నష్టపోతే పరిహారమిచ్చే దిక్కు లేదన్న ఆయన... పండించిన వడ్లను కొనకపోతే... రైతులకు ఇంకేం మేలు చేస్తారు? అని నిలదీశారు.

**విధ్వంసం బీఆర్ఎస్ ధ్యేయం:**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విధ్వంసకర వ్యాఖ్యలు దుర్మార్గం అని ఆయన వ్యాఖ్యలు సరికాదని బండి సంజయ్ మండిపడ్డారు. విధ్వంసంతో సాధించేదేమీ లేదన్నారు. విధ్వంసంతో డబ్బులు వసూలు చేయాలన్నదే బీఆర్ఎస్ ధ్యేయం అని ఆరోపించారు. బీఆర్ఎస్‌ను ప్రజలు పట్టించుకోవడం లేదనడానికి నిదర్శనం బాల్క సుమన్ వ్యాఖ్యలేనన్నారు.

## ఈసీ.. ఎస్ఐఆర్ నిర్వహించొచ్చు

- ఆర్టికల్ 324 ప్రకారం పూర్తి అధికారాలు ఉన్నాయి
- ఖచ్చితమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు ఎస్ఐఆర్ ముందడుగు : సుప్రీంకోర్టు కీలక తీర్పు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఎన్నికల కమిషన్‌కు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించే అధికారం ఉందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆర్టికల్ 324 ప్రకారం ఈసీకి పూర్తి అధికారాలు ఉన్నాయి ఎస్ఐఆర్ విషయంలో ఎన్నికల సంఘం అధికారాలను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టాలకు, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధం కాదని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ చేపట్టాలన్న భారత ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం, ఈ ఏడాది ప్రారంభంలో విస్తృత విచారణల అనంతరం ఈ విషయంలో తీర్పును రిజర్వ్ చేయగా తీర్పును వెలువరించింది. ఖచ్చితమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు ఎస్ఐఆర్ ఒక కీలక అడుగు అని సుప్రీంకోర్టు పేర్కొంది.ఈ ప్రక్రియ రాజ్యాంగానికి కొత్త ఊపిరి పోసే చర్యగా అభివర్ణిస్తూ ఎన్నికల వ్యవస్థ పారదర్శకతను, విశ్వసనీయతను బలోపేతం చేస్తుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ గ్రీన్ సిగ్నల్ పడినట్లైంది.

# గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

- రాబోయే విద్యా సంవత్సరంలో ప్రారంభించాలి
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం,**



రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఏడాది గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు దృష్టి సారించాలన్నారు.. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతులతో విద్యాసంస్థలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవిలోనే అవసరమైన మరమ్మతులు, మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ప్రతి నెల వైద్యులు పరిశీలించాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో గుర్తించి, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్ఈ ఎన్‌పీడీసీఎల్ శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లారీలు పంపరు.. ధాన్యం కొనరు

- సకాలంలో ధాన్యం కొనుగోలు లేక రోడ్డెక్కిన జనగాం రైతులు.
- వడ్ల కొనుగోలు ఆలస్యంపై రైతుల ఆగ్రహం
- మంబాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో

**ముద్ర, తాండూర్ ప్రతినిధి :**



సకాలంలో లారీలు పంపరు ధాన్యం కొనుగోలు చేయరు అంటూ రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించారు. బుధవారం పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామ రైతులు పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు అందుబాటులో లేకపోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతుందని అన్నారు.ఈ క్రమంలో తమ పండించిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని జనగాం గ్రామ రైతులు మంబాపూర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... సకాలంలో ధాన్యం తరలించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని, సకాలంలో లారీలను పంపకపోవడంతో కల్లాల వద్ద పడిగాపులు కాస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే సమయానికి లారీలు పంపరు ధాన్యం కొనుగోలు చేయరు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. రోజుల తరబడి కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.కాగా రైతుల ధర్నాతో కొద్దిసేపు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రెండు లారీలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.తదుపరి అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమింప చేశారు.

## పోలీసుల అదుపులో బండి భగీరథ్

- మూడు రోజులు విచారించనున్న పేట్ బషీరాబాద్ పోలీసులు
- కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో విచారణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన బండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసులో విచారణ జరిపేందుకు మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు నుంచి ఇటీవల అనుమతి తీసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు బుధవారం భగీరథ్ ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారం రోజుల పాటు బండి భగీరథ్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరినప్పటికీ.. కోర్టు మాత్రం మూడు రోజులకే అనుమతి ఇచ్చింది. దీంతో ఈ మూడు రోజులు భగీరథ్‌ను విచారణ చేసి.. ఈ కేసులో మరిన్ని విషయాలను రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు వేసిన కస్టడీ పిటిషన్‌ను బండి భగీరథ్ తరపు లాయర్ కరుణాసాగర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ కోర్టు.. బండి భగీరథ్‌ను కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని.. కోరారు. అంతేకాకుండా విచారణకు ముందు, తర్వాత అతడికి మెడికల్ టెస్టులు నిర్వహించాలని కోరారు. విచారణ సమయంలో బండి భగీరథ్‌పైన బలవంతంగా ఎలాంటి పద్ధతులు వాడకుండా పోలీసులను ఆదేశించాలని కోర్టుకు ఆయన లాయర్ విజ్ఞప్తి చేశారు.

## ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి

- అభివృద్ధి పనులలో మరింత వేగం పెంచాలి..
- ప్రజాదర్బార్ లో మంత్రి సీతక్క

**మహబూబాబాద్, ముద్రప్రతినిధి**



ప్రజాదర్బార్లో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రత్యేకంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో ఖచ్చితంగా పరిష్కరించాలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఆర్డిఓ క్రిష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లాస్థాయి ఉన్నతాధికారులందరితో కలిసి మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడ ఏజెన్సీ ఓటాయి, కొత్తగూడ మండల కేంద్రం లో రాష్ట్ర మంత్రి సీతక్క, ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ..కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపంచాయతీ సర్పంచులు, సూచించిన సమస్యల పరిష్కారం నిమిత్తం వెంటనే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ఆదేశాలు తగు సూచనలు ఆమె జారీ చేశారు. ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత విభాగానికి పంపి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారు దరఖాస్తు చేసుకున్న సంక్షేమ పథకాల ఫలాలు లబ్ధిదారులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సుమారు 60వేల 400 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులు మహిళా సంఘాలలో సభ్యులుగా ఉంటే ఆర్థిక భరోసా కింద లక్షరూపాయలు అందించడం జరుగుతుందన్నారు. గతంలో ఐదు లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆత్మ గౌరవం నిమిత్తం మహిళా సమైక్య భవనాలను నిర్మించడం జరుగుతుందని, అందులో భాగంగానే మండల పరిధిలో ఇప్పటికే 40 భవనాల నిర్మాణ శంకుస్థాపనలు చేయడం జరిగిందని, ఇందిరమ్మ చీరల పంపిణీ చేశామన్నారు. రైతుల పొలాల వద్దకు వెళ్లడం కోసం రహదారుల నిర్మాణం లో ఉన్నాయని, ఫారెస్ట్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు నిర్మించాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగానే జిల్లాకు వచ్చిన కోటాకు అదనంగా మరో రెండు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కరెంటు సమస్యలను తీర్చడం కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేత ప్రత్యేకంగా కరెంటు స్తంభాల మంజూరు, నిధుల మంజూరు చేయిం చడం జరిగిందన్నారు. ఈ.సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా ప్రజల సమస్యలను ఓపికగా వింటూ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఇండ్ల స్థలాలు, ఆసరా పెన్షన్లు, భూమి సమస్యలు, రేషన్ కార్డులు, గ్రామాల్లో రోడ్లు, తాగునీరు మరియు ఆరోగ్య సహాయం వంటి పలు అంశాలపై ప్రజలు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ప్రజా ప్రభుత్వం. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, పాలనను ప్రజల వద్దకే తీసుకురావాలన్నదే మా సంకల్పం. ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు, న్యాయం చేకూరేలా చూస్తాం" అని హామీ ఇచ్చారు. తమ సమస్యలను నేరుగా మంత్రి సీతక్కకు చెప్పుకునే అవకాశం కల్పించడం పై, ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదనరాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో మునవర్ బేగ్ అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా స్వామివారికి లక్ష పుష్పార్చన

**ముద్ర, యాదగిరిగుట్ట :**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ఆలయ అర్చకులు వైభవంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వామి అమ్మవార్లను బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి వివిధ రంగురంగు పూలతో స్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు ఈవో భవాని శంకర్ ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి ప్రణీత్ చార్యులు భక్తులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 28.05.2026
www.mudranews.in | @mudranews



## ధూమపానానికి దూరంగా ఉండటం

ధూమపానం అనేది అనారోగ్యకర వృద్ధాప్యానికి దారితీసే అత్యంత ప్రమాదకరమైన అలవాట్లలో ఒకటి. ఏ వయసులోనైనా ధూమపానం మానేయడం వల్ల గుండెజబ్బులు, క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించి ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచుకోవచ్చు.



# సంసారం.. ఓ చదరంగం..



ఇటీవలి కాలంలో భార్యాభర్తల మధ్య పెరుగుతున్న ప్రవర్తనా మార్పులు కుటుంబాల్లో కలతలకు దారితీస్తున్నాయి. కుటుంబంలో సర్దుబాటు చేసుకోలేని వ్యక్తి బయట మరో వ్యక్తితోనూ సర్దుకుపోలేడు. మనిషి సమాజంలో జీవించాలంటే పరస్పర అవగాహన, సహనం అవసరం. ఈ నేపథ్యంలో రెండు కథలు జీవితానికి మంచి పాఠాలను చెబుతాయి.

ఒక దంపతుల మధ్య ప్రతిరోజూ గొడవలు జరుగుతుండేవి. భర్త ఎంత ప్రేమగా మాట్లాడినా భార్య కోపాన్ని నియంత్రించుకోలేక ఘర్షణపడేది. ఒకరోజు భర్త ఇంట్లో ఉన్న మేకులు తీసుకొచ్చి, "నీకు కోపం వచ్చినప్పుడల్లా గోడకు ఒక మేకు కొట్టు" అన్నాడు. మొదట్లో భార్య ప్రతిసారి అలాగే చేసింది. కానీ మేకులు కొట్టడం అంత సులభం కాదని గ్రహించి క్రమంగా తన కోపాన్ని అదుపులో పెట్టుకుంది. తర్వాత భర్త చెప్పినట్లు ఒక్కో మేకును తీసేయడం ప్రారంభించింది.

అప్పుడు భర్త గోడలో ఉన్న రంధ్రాలను చూపిస్తూ, "నువ్వు నాపై కోపంగా మాట్లాడిన ప్రతిసారి నా మనసుకూ ఇలాగే గాయాలయ్యాయి" అన్నాడు. ఆ మాటలకు భార్య క్షమాపణ కోరింది. కోపం సహజమైన భావోద్వేగమే అయినా దాన్ని నియంత్రించగలిగితే సంబంధాలు నిలబడతాయి. వేమన చెప్పినట్లు "తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష". నేడు డబ్బు, ఆస్తుల కోసం విలువైన బంధాలను కోల్పోతున్నాం. కానీ నష్టం జరిగిన తర్వాత బాధపడటం వల్ల ప్రయోజనం ఉండదు.

మనిషికి సంపద సౌకర్యం మాత్రమే ఇస్తుంది, జీవితం కాదు. యాపిల్ సహ వ్యవస్థాపకుడు Steve Jobs కూడా తన చివరి దశలో "ఆరోగ్యం తిరిగి రాదు, మృత్యువు మన చేతిలో లేదు" అన్నాడు. కాబట్టి బ్రతికున్నప్పుడే మనసులు గాయపడకుండా జాగ్రత్త పడాలి.

ఇలాంటిదే మరో కథ. ఓ యువతి తన భర్తను భరించలేక తల్లివద్దకు వెళ్లి "అతడిని చంపాలనిపిస్తోంది" అంటుంది. అప్పుడు తల్లి ఒక డబ్బా ఇచ్చి, "ఇది నెమ్మదిగా పనిచేసే విషం. కానీ అనుమానం రాకుండా అతడితో ప్రేమగా ప్రవర్తించు" అని చెబుతుంది. ఆ యువతి ఇంటికి వెళ్లి భర్తకు ఇష్టమైన వంటలు చేస్తూ, అత్తమామలను గౌరవిస్తూ, అందరితో మంచిగా మెలగడం ప్రారంభించింది.

కొద్ది రోజులకే భర్త ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. అతడు ఆమెను గౌరవించడం, ప్రేమగా చూసుకోవడం ప్రారంభించాడు. దీంతో భయపడి తల్లివద్దకు వెళ్లి "ఆ విషానికి విరుగుడు ఉందా?" అని అడిగింది. అప్పుడు తల్లి నవ్వుతూ "నేను ఇచ్చింది విషం కాదు. కొన్ని రుచికరమైన పదార్థాల మిశ్రమం మాత్రమే. విషం నీ ఆలోచనల్లో ఉంది" అని చెప్పింది.

చిన్న చిన్న అపార్థాలను పెద్దవి చేసుకుంటే జీవితాలే దెబ్బతింటాయి. "కలతలు లేని కాపురాలు, అలలు లేని సాగరాలు ఉంటాయా?" అన్నట్లుగా ప్రతి కుటుంబంలో సమస్యలు సహజం. ఓపిక, ప్రేమ, పరస్పర గౌరవం ఉంటే సమస్యలు సర్దుకుంటాయి. తొందరపాటు నిర్ణయాలు మాత్రం జీవితాలను నాశనం చేస్తాయి.

నేడు అనేక కుటుంబాల్లో తల్లిదండ్రుల మితిమీరిన జోక్యం కూడా భార్యాభర్తల మధ్య దూరాన్ని పెంచుతోందని పరిశోధనలు చెబుతున్నాయి. ఫలితంగా విడాకులు, నేరాలు పెరుగుతున్నాయి. తప్పు రెండు వైపులా ఉండొచ్చు. కానీ మన ఆలోచనా విధానమే మన జీవితాన్ని మార్చుతుంది అనే విషయాన్ని ఎప్పటికీ మరవకూడదు.




- డా. మహమ్మద్ హాసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
కెరీర్ కౌన్సిలింగ్ కోచ్
9908059234

# ఎన్టీఆర్ స్ఫూర్తితోనే శేరిలింగంపల్లి ప్రగతి: ఆరికెపూడి గాంధీ

**ముద్ర, హైదరాబాద్ :** తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ ఆయనకు ఘన నివాళులర్పించారు. ఎన్టీఆర్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ప్రజా సంక్షేమానికి కొత్త నిర్వచనం చెప్పిన యుగపురుషుడని కొనియాడారు. రాజకీయాల్లో తనకు ఓనమాలు నేర్పిన ఆదర్శమూర్తి ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలు, విలువలే తన రాజకీయ ప్రస్థానానికి మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు.

సామాన్య కార్యకర్తగా ప్రారంభమైన తన రాజకీయ ప్రయాణం నేడు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజల సేవ చేసే స్థాయికి చేరడానికి ఎన్టీఆర్ స్ఫూర్తే ప్రధాన కారణమని గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి వెనుక కూడా ఎన్టీఆర్ చూపిన ప్రజా సంక్షేమ బాటే ప్రేరణగా నిలుస్తోందని చెప్పారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే నాయకత్వ లక్షణాలను ఎన్టీఆర్ నుంచే నేర్చుకున్నానని పేర్కొన్నారు.

వెండితెరపై రాముడు, కృష్ణుడి పాత్రలతో కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించిన ఎన్టీఆర్, రాజకీయాల్లోకి వచ్చాక పేదల పక్షపాతిగా నిలిచారని గాంధీ గుర్తుచేశారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి సామాజిక సంక్షేమానికి కొత్త దారిని చూపారని కొనియాడారు. అలాగే పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా పాత తాలూకా వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకువచ్చిన దూరదృష్టి గల నాయకుడు ఎన్టీఆర్ అని తెలిపారు. మహిళల సాధికారత కోసం ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని గాంధీ అన్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళలకు వారసత్వ ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలోనూ, సామాజిక మార్పులకు నాంది పలకడంలోనూ ఎన్టీఆర్ పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలతో ప్రభావితమై రాజకీయాల్లోకి వచ్చిన యువతలో తాను కూడా ఒకడినని గాంధీ భావోద్వేగంగా చెప్పారు. ఆ మహానేతను



పలుమార్లు ప్రత్యక్షంగా కలిసిన మధుర క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతి ఉన్నంతవరకు ఎన్టీఆర్ కీర్తి చిరస్థాయిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఆయన చూపిన ప్రజా సంక్షేమ మార్గంలోనే ముందుకు సాగుతూ శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని గాంధీ ఉద్ఘాటించారు.

## డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన గిన్నిస్ రికార్డ్ హోల్డర్ డా. పెండెం కృష్ణ కుమార్

**ముద్ర, హైదరాబాద్ :** నాలుగు సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన ప్రముఖ నటుడు, రచయిత, పర్యావరణవేత్త, సోషల్ వర్కర్ డా. పెండెం కృష్ణ కుమార్ ఈరోజు డీజీపీ కార్యాలయంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులుగా క్లాత్ బ్యాగులను వినియోగించాలని సమాజానికి సూచిస్తున్నట్లు డీజీపీకి వివరించారు. అనంతరం డా. కృష్ణ కుమార్ డీజీపీకి క్లాత్ బ్యాగులను అందజేశారు. ఇప్పటికే లక్షకు పైగా క్లాత్ బ్యాగులను ప్రజలకు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న డా. కృష్ణ కుమార్ సేవలను డీజీపీ ప్రశంసించారు. అలాగే ఆయన సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డులపై అభినందనలు తెలిపారు.




## 10 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న వండర్లా

**- ఇప్పటికే 68 లక్షలకు పైగా సందర్శకులు - 13 కోట్ల రైడ్ మైలురాయి**
**- తాజాగా మరిన్ని ఆఫర్లు**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ కు అత్యంత కీలకమైన ఆహ్లాద వేదికగా మారిన 'వండర్లా హైదరాబాద్' 10వ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకుంటోంది. 2016లో ప్రారంభమైనప్పటి నుండి, ఈ పార్క్ 68 లక్షల మందికి పైగా సందర్శకులను ఆకర్షించింది. ల్యాండ్, వాటర్ రైడ్ల కలయికతో ఇక్కడి ఆకర్షణల ద్వారా 13.6 కోట్లకు పైగా రైడ్ అనుభవాలను అందించింది. వేసవి సీజన్ వేడుకల్లో భాగంగా, వండర్లా హైదరాబాద్ పార్క్ టిక్కెట్లు, టిక్కెట్-ప్లస్-బఫే కాంబోలపై ప్రత్యేక తగ్గింపు ధరలను ప్రవేశపెట్టింది. ఈ ఆఫర్లు 14 జూన్ 2026 వరకు కేవలం ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. సందర్శకులు టిక్కెట్లపై 31% వరకు, టిక్కెట్-ప్లస్-బఫే ప్యాకేజీలపై 33% వరకు తగ్గింపును పొందవచ్చు. వీక్‌డేస్ లో సందర్శనకు ధరలు రూ. 1,219 వారాంతపు సందర్శనకు రూ.1,249 నుండి ప్రారంభమవుతాయి. ఈ వేడుకల్లో భాగంగా, 2016లో జన్మించిన పిల్లలకు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును చూపించడం ద్వారా ఉచిత ప్రవేశం కూడా లభిస్తుంది. కార్పొరేట్ ఈవెంట్లకు ఆతిథ్యం ఇస్తూ వండర్లా హైదరాబాద్ ఒక పూర్తి స్థాయి 'ఫుల్-డే డెస్టినేషన్'గా పేరుగాంచింది. ఇక్కడికి వచ్చే సందర్శకులు సగటున దాదాపు ఆరు గంటల పాటు పార్క్‌లోనే గడుపుతుండటం విశేషం. ఈ సందర్భంగా వండర్ లా ఎండీ అరుణ్ కె.చిట్టిలపిల్లి మాట్లాడుతూ, "మాకున్న అత్యంత డైనమిక్ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటి. ఇక్కడ వినియోగదారుల అంచనాలు చాలా వేగంగా మారు తుంటాయి. అలాగే సరికొత్త అనుభూతుల కోసం ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. గత దశాబ్ద కాలంలో వండర్లా హైదరాబాద్ కేవలం ఒక వినోద ఉద్యానవనంగానే కాకుండా, నగర ప్రజలు పండుగలు వేడుక చేసుకునే, కలిసి సమయాన్ని గడిపే ఒక వేదికగా ఎదిగింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, మా సందర్శకులకు సరికొత్త అనుభవాలను అందించేందుకు నిరంతరం కొత్త రైడ్స్, ఆకర్షణలను ప్రవేశపెట్టడంపైనే మేం ప్రధానంగా దృష్టి సారిస్తాం'' అని అన్నారు.


## కాళేశ్వరంలో అవధూత గిరి మహారాజ్ పూజలు



**మహదేవపూర్,ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, బర్ధి శ్రీ దత్త గిరి మహారాజ్ ఆశ్రమం వారు కాళేశ్వరానికి విచ్చేసి సరస్వతి నదిలో పుణ్యస్నానం ఆచరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులకు, భక్తులకు ఆశీర్వచనం చేసారు. ఆలయం తరపున స్వామివారి శేష వస్త్రాలతో మహారాజ్ స్వామీజీకి అందించారు . ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సలహాదారు గోవింద హరి గారు ఆలయ ఈవో ఎస్ మహేష్, చైర్మన్ మోహన్ శర్మ చైర్మన్, ధర్మకర్తలు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాలలో పేరిణి నృత్య వైభవం

**మహదేవపూర్, ముద్ర:** నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ వ్యవస్థాపకులు, ప్రముఖ నాట్యాచార్యులు గురుశ్రీ గజ్జెల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో కళాకారుల బృందం అద్భుతమైన పేరిణి నృత్య ప్రదర్శనను అందించారు. తెలంగాణ వైభవానికి ప్రతీకగా నిలిచే పేరిణి శివతాండవ నృత్యాన్ని ఉత్సాహభరితంగా ప్రదర్శిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో భాగంగా పురుష కళాకారులు మేళాప్రాప్తి, తహన విన్యాసాలు, శివ పంచభూత శబ్దాలు ప్రదర్శించి పేరిణి నృత్యంలోని వీరరసాన్ని





ఆవిష్కరించారు. దేవాదాయ శాఖ సహకారంతో పరంపర ఫౌండేషన్ నిర్వహిస్తున్న "గుడి సంబరాలు" సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు తెలంగాణ సంప్రదాయ కళారూపాల వైభవాన్ని ప్రతిబింబిస్తూ కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక-సాంస్కృతిక కేంద్రంగా నిలుపుతున్నాయి.ఈ కార్యక్రమంలో పేరిణి నృత్య ప్రదర్శనలోఇమంది వెంకట పైడరావు, తొడసం గురుదేవ్, రేగుల చందు, తోడెంగా సంతోష్, మర్కల లోహిత్, ఆరే నరేష్, మూగు సాయి కపిల్, అన్నెల దేవి రాజేష్, పల్నాటి శ్రీజ, బండారి వైష్ణవి, బండారి తేజస్విని, రామచరణి, గడ్డం విద్యశ్రీ, జక్కోజు సుఘందిని, పిడిషోజు సమీక్ష, జెట్టి రిత్విక అనే కళాకారులు పాల్గొన్నారు.

## అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా సాగిద్దాం

**కేంద్ర సమాచార శాఖ మంత్రిజ్యోతిరాదిత్య సింధియా తో సీఎం రేవంత్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో ,:** తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హై-స్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని అందించే లక్ష్యంగా అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా అమలు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి కొన్ని కీలక అంశాలను కేంద్ర సమాచార శాఖ మంత్రిజ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించి సాధ్యమైనంత తొందరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధులను సత్వరం విడుదల చేయడం వంటి అంశాలను సీఎం చర్చించారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై సీఎం, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా గారితో చర్చించారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధి కి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఉండాలని కేంద్ర మంత్రిని కోరారు. వీటిపై సింధియా సానుకూలంగా స్పందించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే తెలంగాణ దార్శనికతపై ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. తెలంగాణ ఆశిస్తున్న లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మొదటి దశలో, నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరిస్తారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వారం గడువు.. లేదంటే మళ్లీ రైతు రణభేరి

**- వడ్ల కొనుగోళ్లపై బీజేపీ ఆగ్రహం.. రైతులకు అండగా నేతలు**
**- కాటారం మార్కెట్ యార్డ్‌లో వడ్ల కుప్పల పరిశీలన చేసిన బీజేపీ నేతలు**
**- రైతుల సమస్యలు పరిష్కరించకపోతే భారీ ధర్నా తప్పదు**
**- వడ్లు కొనకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్న కిసాన్ మోర్చా నేతలు**

మహాదేవపూర్, ముద్ర: కాటారం మార్కెట్ యార్డ్ లోని వడ్ల కుప్పల్ని పరిశీలన చేసి రైతులతో వరి బాధల గురించి మాట్లాడి పోలీస్ కేసు కు గురైన బాధితులతో మాట్లాడారు. వారం రోజులు లో వడ్ల కొనుగోలు పూర్తి చేయకపోతే మళ్ళీ యాత్ర చేసి రైతులతో రణ బేరి మొగిస్తామని రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర నాయకులు అన్నారు. బీజేపీ తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాలక్ష్మి నర్సయ్య ఆధ్వర్యంలో రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయశ్రీ, రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రపట్ల సునీల్ రెడ్డి, చల్ల నారాయణ రెడ్డి, కీర్తి రెడ్డి, మిగతా రాష్ట్ర నాయకులతో కలిసి కొత్తపల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్ లో గల వడ్ల ధాన్యము కుప్పలని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని బీజేపీ పక్షాన అండగా ఉంటామని అన్నారు. అనంతరం వరిధాన్యం కొనాలని ధర్నా చేసి కేసుపాలైన కాటారం మండల కేంద్రానికి చెందిన తిరుపతిని పరామర్శించారు. కార్యక్రమం లో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిశిధర్ రెడ్డి, మండల అధ్యక్షులు పాగె రంజిత్ కుమార్, మేడిపల్లి పూర్ణ చందర్, మనోజ్, శ్రీకాంత్,రాష్ట్ర, జిల్లా, నాయకులు పాల్గొన్నారు..



## నారెడ్కో, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ కీలక ఒప్పందం

**నిర్మాణ రంగంలో నూతన ఆవిష్కరణలు - నైపుణ్యాలను తీర్చిదిద్దే ప్రయత్నం**




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ఇంజి నీర్లను తీర్చిదిద్దడమే లక్ష్యంగా నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ తెలంగాణ (నారెడ్కో తెలం గాణ), ఇంజనీరింగ్ నిపుణుల కోసం నిరంతర విద్య, సామర్థ్య పెంపుపై దృష్టి సారించిన ఒక ప్రముఖ విద్యా సంస్థ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్ సిఐ)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. వేగవంతమైన మౌలిక సదుపాయాల విస్తరణ, పెరుగుతున్న పెట్టుబడులు, దీర్ఘకాలిక పట్టణ ప్రణాళికల ద్వారా ప్రపంచ స్థాయిలో పోటీపడగల నగర కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్న తరుణంలో, నైపుణ్యం కలిగిన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తి అవసరం అత్యంత కీలకంగా మారింది. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ పొందిన నిపుణులను తీర్చిద్దిదడం ద్వారా నగరం యొక్క అభివృద్ధికి మద్దతు ఇవ్వాలనే నారెడ్కో తెలంగాణ భావిస్తోంది. ఈ సందర్భంగా నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు కొప్పుల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, "మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, పట్టణాభివృద్ధి రంగాలలో ప్రపంచ ప్రమాణాలతో కూడిన నగరంగా హైదరాబాద్ ఎదుగుతూ ఒక కీలకమైన వృద్ధి దశాబ్దంలోకి అడుగుపెడుతోందన్నారు. ఈఎస్‌సీఐతో ఈ భాగస్వామ్యం ద్వారా, సాంకేతికంగా నైపుణ్యం కలిగినవారే కాకుండా, నిర్మాణం మరియు ప్రాజెక్ట్ నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోగల సామర్థ్యం ఉన్న కొత్త తరం నిపుణులను తీర్చిదిద్దాలనేదే తమ లక్ష్యమన్నారు. డాక్టర్ జి. రామేశ్వర రావు మాట్లాడుతూ, "ఈఎస్‌సీఐ వద్ద, నిర్మాణాత్మక అభ్యాసం మరియు పరిశ్రమకు సంబంధించిన కార్యక్రమాల ద్వారా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడంపైనే తమ దృష్టి ఉంటుందని, నారెడ్కో తెలంగాణతో మా భాగస్వామ్యం రియల్ ఎస్టేట్ , నిర్మాణ రంగాల మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కోర్సులను రూపొందించి, అందించడానికి వీలు కల్పిస్తుందన్నారు.ఈ ఒప్పందంతో నిర్మాణ రంగంలోని నిపుణుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, సర్టిఫికేషన్ కోర్సులు, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను రూపొందించి, అందించడంపై దృష్టి సారించనున్నారు.

### తగినంత నిద్ర

సరైన నిద్ర లేకపోతే అధిక రక్తపోటు, ఊబకాయం, డిప్రెషన్ మరియు రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం ప్రతిరోజూ తగినంత సమయం ప్రశాంతంగా నిద్రపోవడం ఎంతో ముఖ్యం.

## ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలపై అవగాహన పెంచాలి

**- డాక్టర్ పి. లక్ష్మణ్ నాయక్**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సేవలను మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. లక్ష్మణ్ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణీలకు హెల్ప్ డెస్క్ ద్వారా సమర్థవంతమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖ ప్రసవం పొందేలా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఆయన, ప్రసవానికి ఆసుపత్రికి వచ్చే సమయంలో 108 లేదా 102 అంబులెన్స్ సేవలను తప్పనిసరిగా వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. డెలివరీ అనంతరం ఇంటికి వెళ్లేందుకు కూడా 102 వాహన సేవలను వినియోగించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రాజగోపాల్ చారి, ఓరుగంటి శ్రీనివాసులు, నరసింహ, సోషల్ వర్కర్ జ్యోతి, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి. యాదగిరి, సుజాత, 102 వాహన జిల్లా మేనేజర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రజా సేవే మా లక్ష్యం

**- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి, సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జూన్ 3న నాగర్‌కర్నూల్‌లో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా మహిళా శక్తి భవన ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేయడమే తమ లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, స్థానిక కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత కుటుంబ సలహా కేంద్రం ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబాల్లో చిన్న చిన్న అపార్థాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందుగానే పరిష్కారం చూపించే వేదికగా ఈ సలహా కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. కుటుంబ విలువలు, పరస్పర గౌరవం, సామరస్యంతో సమాజం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఉచితంగా సలహాలు, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రారంభించిన ఈ కేంద్రం ద్వారా మహిళలు, యువత, కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల్ ప్రెసిడెంట్ వివేక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, బహదూర్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మార్కెట్ డైరెక్టర్ మాధవ్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మద్దతు



**ముద్ర, మల్కాజిగిరి:** గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ నేరేడ్మెట్ జోన్–మల్కాజిగిరి ఆధ్వర్యంలో సఫిల్‌గూడ చౌరస్తాలో సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు గత కొద్ది రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్ కార్మికులందరికీ లేబర్ కార్డులు అందేలా కృషి చేస్తానన్నారు. కార్మిక శాఖ, కార్మిక సంక్షేమ మండలిలో నమోదు చేసుకున్న కార్మికులు లేబర్ కార్డు ద్వారా లభించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజల మధ్యలో ఉంటూ అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అని సెంట్రింగ్ కార్మికుల సంక్షేమ సంఘం సభ్యులు కొనియాడారు. తమ సమస్యలపై వెంటనే స్పందించి దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు తెలిపిన ఎమ్మెల్యేకు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరుశురాం రెడ్డి తదితర కార్మిక నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించం

**–కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరు, వైద్య సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఏఎన్ఎం కిట్‌లో పాము కాటు మందులు, కుక్క కాటు వ్యాక్సిన్లు, చిన్నారుల టీకాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రోగులతో మాట్లాడి సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్న కలెక్టర్, వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. పరిశుభ్రత, గర్భిణీలు మరియు చిన్నారుల వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ తనిఖీలో అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ త్యాగం, విశ్వాసం, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పేద లకు సహాయం చేయడం, దాన ధర్మాలు చేయడం బక్రీద్ గొప్ప సందేశమని తెలిపారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగాలని ఆకాంక్షిస్తూ ప్రజలు ప్రేమాభిమానాలతో సామాజిక ఐక్యతను బలోపేతం చేయాలని కోరారు.

## 104 సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో పనిచేస్తున్న 104 నిర్దిష్ట దిన ఆరోగ్య సేవల ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు తమకు గత 12 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ ఆర్ఎంఓ డాక్టర్ అజీమ్‌కు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఏడాదిగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. కుటుంబ పోషణ కష్టంగా మారిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత 18 సంవత్సరాలుగా ప్రభుత్వం అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించామని సిబ్బంది పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వ సూచనల మేరకు ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో రోగులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో 104 ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రమేష్, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, సభ్యులు వినోద్ కుమార్, యాదగిరి, గోవర్ధన్, శ్రీనివాసులు, మహేందర్ నాథ్, సురేష్, రాజశేఖర్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి కార్పొరేషన్ పీఠం కాంగ్రెస్ దే..

**- అనిల్ కుమార్ యాదవ్**

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎన్ని రాజకీయ జిమ్మిక్కులు జరిగినా గ్రేటర్ మల్కాజిగిరి కార్పొరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ గ్రాండ్ కన్వెన్షన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ కుమార్ యాదవ్ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

సమావేశంలో బీఎల్ఏల నియామకం, ఎస్ఐఆర్ కార్యక్రమంపై చర్చించడంతో పాటు త్వరలో ఏర్పాటు చేయనున్న కొత్త పార్టీ కమిటీలపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించిన ఆయన, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు.



ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సమీర్, మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మహమ్మద్ ముజీబుద్దిన్, పీసరి మైపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులతో పాటు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి

**- ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి**



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్ద చెరువును రూ.19 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం హైడ్రా అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన ఆయన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. రామంతాపూర్ పెద్ద చెరువును హైడ్రా ఆధ్వర్యంలో సుందరీకరించి వాకింగ్ ట్రాక్, లైటింగ్, గ్రీనరీ వంటి సదుపాయాలతో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో హబ్సిగూడ ప్రాంతంలోని సెంట్ జోసెఫ్ స్కూల్ పరిసరాలు, రవీంద్ర నగర్ కాలనీ, సాయిచిత్ర నగర్, మహేశ్వరి నగర్ ప్రాంతాలు వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని విమర్శించారు. సమస్య పరిష్కారానికి అప్పటి పాలకులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వచ్చే వరద నీటిని తరలించేందుకు రూ.16 కోట్లతో ఎస్ఎన్‌డీపీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తయితే కాలనీలు ముంపు సమస్య నుంచి ఉపశమనం పొందుతాయని చెప్పారు. చెరువు సుందరీకరణ పనుల వల్ల స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని, పేదల గుడిసెలను తొలగించబోమని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అమ్మపల్లి ఆలయంలో చోరీ

**ముద్ర, శంషాబాద్:** శంషాబాద్ మండల పరిధి నర్కూడ గ్రామంలోని అమ్మపల్లి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని దుండగులు హుండీని అపహరించి అందులోని నగదును దోచుకెళ్లిన ఘటన కలకలం రేపింది. పోలీసుల తెలిపిన ప్రకారం.. నర్కూడ గ్రామానికి చెందిన చేగొమ్మ సత్యనారాయణ మూర్తి గత 32 సంవత్సరాలుగా అమ్మపల్లి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 26న రాత్రి పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఆలయ కాపలాదారుడు రాజు మెండేతో కలిసి ఆలయానికి చేరుకోగా, ప్రధాన ఆలయ ద్వారాల తాళాలు పగులగొట్టబడినట్లు గుర్తించారు. అనంతరం లోపలికి వెళ్లి పరిశీలించగా, అక్కడ ఉన్న చిన్న హుండీ కనిపించకుండా పోయింది. తర్వాత ఆలయం బయట మండపం సమీపంలో హుండీ పగిలిపోయిన స్థితిలో ఖాళీగా పడి ఉండటాన్ని గుర్తించారు. హుండీలో సుమారు రూ.5 వేల నగదు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.





### వ్యక్తి అనుమానాస్పద మృతి

**ముద్ర, జోగులాంబ గద్వాల:** జోగులాంబ గద్వాల జిల్లాలో విషాద ఘనట చోటు చేసుకుంది. గద్వాల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన పరశురాముడు అనే వ్యక్తి, జమ్మిచేడు జమ్ములమ్మ దేవస్థానం సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం ఉదయం దేవస్థానం పరిసరాల్లో పరశురాముడు అచేతనంగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు, వెంటనే గద్వాల పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. పరశురాముడి మరణంపై స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలింపు..**

పరశురాముడిది సహజ మరణమా, లేక ఎవరైనా దుండగులు హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, పరశురాముడు చివరిసారిగా ఎవరితో ఉన్నారు, ఆ ప్రాంతానికి ఎలా వచ్చారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానికంగా ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

### విద్యుత్ ప్రమాదంలో ఎద్దు మృతి

**ముద్ర, జోగులాంబ గద్వాల:** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం ఈడిగోనిపల్లి గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ లింగన్నకు చెందిన ఎద్దు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందింది. గ్రామస్థుల తెలిపిన ప్రకారం.. రాత్రి సమయంలో పొలం సమీపంలో తిరుగుతున్న ఎద్దుకు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం గమనించిన రైతు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతి చెందిన ఎద్దు వ్యవసాయ పనులకు ఉపయోగపడేదని దీని విలువ సుమారు రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉంటుందని రైతు లింగన్న తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 28.05.2026
www.mudranews.in | @mudranews



**ఒత్తిడి నియంత్రణ:**



దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు), కార్టిసోల్ స్థాయిలు పెరిగి గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. ఒత్తిడిని తగ్గించుకుని, భావోద్వేగ సమతుల్యత. విశ్రాంతిని అలవరచుకోవడం వల్ల మెటబాలిక్ ఆరోగ్యం మెరుగవుతుంది.

# కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యం

- చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ఆర్నకొండ - మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులకు కేంద్ర మంత్రి శ్రీకారం
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహా పలువురు కాంగ్రెస్ నేతల హాజరు



**ముద్ర, కరీంనగర్:** కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడంవల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే రూ.50 కోట్లతో ఆర్నకొండ మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించుకోగలగుతున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదిత రులతో కలిసి కేంద్ర మంత్రి ఆర్నకొండ నుండి మల్యాల వరకు 35 కి.మీల మేరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ చొప్పదండి మండలం అర్నకొండ గ్రామం నుండి గోపాల్ రావు మీదుగా మల్యాల వరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించే పనులకు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొత్తం 50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ రోడ్డును విస్తరించబోతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సీఆర్ఐఎఫ్ నిధులతో ఈ పనులను చేపడుతున్నామన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ చుట్టుపక్కల ఉన్న మండలాల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అట్లాగే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు ఈ రోడ్డు అత్యంత సమీప మార్గం కాబోతోందన్నారు. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు చోట్ల కల్వర్టులను కూడా నిర్మించబోతున్నామన్నారు. అట్లాగే ఒక చోట మైనర్ బ్రిడ్జి విస్తరణ పనులను కూడా చేపడమని తెలిపారు. ఏడాదిలోపు ఈ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గడువు విధించామన్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్ తో ఒప్పందం కుదిరిందన్నారు. ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా, గ్రామమైనా బాగుపడాలంటే... రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుందన్నారు. అందుకే తాను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక ప్రాధాన్యత రోడ్ల నిర్మాణానికే ఇచ్చానన్నారు. గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, సీఆర్ఐఎఫ్ కార్యక్రమాల నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏడేళ్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 20 వేల కోట్లకుపైగా కేంద్ర నిధులు తీసుకొస్తే, అందులో రోడ్ల నిర్మాణం కోసం 7 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసినమన్నారు.

2 వేల 147 కోట్లు నిధులతో కరీంనగర్–వరంగ ల్ నేషనల్ హైవే, 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి–సిద్దిపేట నేషనల్ హైవే పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్, జగిత్యాల ప్రజల చిరకాల వాంఛ గా ఉన్న కరీంనగర్– జగిత్యాల రోడ్డు విస్తరణ పనుల విషయంలో రకరకాల కారణాలవల్ల కొంత జాప్యం జరిగిందన్నారు దాదాపు 2 వేల కోట్ల నిధులతో ఈ జాతీయ రహదారి పనులకు అతి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. సీఆర్ఐఎఫ్

నిధులను సైతం పెద్ద ఎత్తున కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చినట్లు చెప్పారు. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఐఆ ర్ఎఫ్ నిధులు మంజూరైతే... అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ కే 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించినమన్నారు. ఇప్పటి వరకు దాదాపు 400 కోట్లకుపైగా సీఐఆర్ఎఫ్ నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. అట్లాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద (వచ్చే జులై 1 నుండి వీబీజీ రామ్ జీ స్కీంగా పేరు మారబోతోంది) ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్ల మెంట్ పరిధిలో ఖర్చు చేసినమని ఆయన పేర్కొన్నారు.

## రైతులకు అండగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్

- చేగుర్తిలో వర్షానికి తడిసిన ధాన్యం పరిశీలన



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెంటనే గ్రామానికి చేరుకుని రైతులను పరామర్శించారు. తడిసిన ధాన్యాన్ని చూసి నిరాశలో ఉన్న రైతులకు ధైర్యం చెప్పిన ఆయన, అక్కడికక్కడే హమాలీలను ఏర్పాటు చేయించడంతో పాటు ట్రాక్టర్లను సమకూర్చారు. స్వయంగా ధాన్యం కాంటా చేయించి రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని గంగుల కమలాకర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి సహాయం చేయడంతో రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగారిక టౌన్‌షిప్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి





**ముద్ర, కరీంనగర్:** తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో గల రాజీవ్ స్వగృహ అంగారిక టౌన్‌షిప్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో సంబంధిత శాఖ అధికారులతో టౌన్‌షిప్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల స్థితిగతులను అడిగి తెలుసుకుని అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. టౌన్‌షిప్‌లో ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సంబంధిత పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు.అంగారిక టౌన్‌షిప్‌ను అన్ని వసతులతో అద్భుతంగా తీర్చిదిద్దాలని, పనుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్, తిమ్మాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ ఎస్సీ సెల్ సెక్రెటరీగా కొండ్లెపు అర్జున్



**ముద్ర, కోరుట్ల:** పీసీసీ ఎస్సీ సెల్ సెక్రెటరీగా కోరుట్ల మండల కేంద్రానికి చెందిన కొండ్లెపు అర్జున్ మోచి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం డిల్లీలో ఇందిరా భవన్ లో జరిగిన సమావేశంలో ఏఐసీసీ ఎస్సీసెల్ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతం నియామక పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కొండ్లెపు అర్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్ర లో ఎస్సీ ఉపకులాలను గుర్తిస్తూ తనను రాష్ట్ర సెక్రటరీ గా నియమించడం చరిత్రత్మాకమన్నారు. ఎస్సీ సెల్ మరింత బలోపేతం కోసం కృషి చేస్తునే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ, 57 ఎంబిఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు భైరి వెంకటేశం కు కృతజ్ఞతలు తెలిపారు.

## యధావిధిగా పుష్కరాలు ..



**మహాదేవపూర్, ముద్ర:** కాళేశ్వరంలో జరుగుతున్న అంత్య పుష్కరాలు జూన్ 1 వరకు కొనసాగుతాయని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు పనగంటి నాగఫణి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను నమ్మవద్దని కోరారు.

## బక్రీద్ ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా




**ముద్ర, కరీంనగర్:** జిల్లాలో గురువారం జరగనున్న బక్రీద్ పర్వదినాన్ని ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లపై మున్సిపల్, పోలీస్, పశుసంవర్ధక శాఖల అధికారులతో బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పండుగ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా స్లాటర్ హౌస్‌ల వద్ద అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. స్లాటర్ హౌస్‌ల నుంచి వెలువడే వ్యర్థాలను నిబంధనల ప్రకారం సక్రమంగా డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆవులు, దూడల వధ పూర్తిగా నిషేధమని, దీనిపై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు వేడుకలు నిర్వహించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటామని, ఆవులు, దూడల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, డీపీవో జగదీశ్వర్, జిల్లా పశువైద్యాధికారి లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం వద్దని, తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సోన్, జాఫ్రాపూర్, మామడ మండలం కొరటికల్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిర్ణీత తేమ శాతానికి రాగానే ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం అన్‌లోడింగ్‌లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. హమాలీల సంఖ్యను పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్లు సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



**ముద్ర, కోరుట్ల:** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా కలెక్టర్ బుధవారం జిల్లా లోని ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, మెట్ పెల్లి మండలం రామ లచ్చక్క పేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమయ్యే విధంగా చుడాలన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహరావు, డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు నిర్మల్ లో రైతు గోస - బీజేపీ భరోసా



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బీజేపీ రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమం లో భాగంగా గురువారం నిర్మల్ జిల్లాలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నేత రావుల రామ్ నాథ్ తెలిపారు. నిర్మల్ లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిన నేపథ్యంలో మూడు రోజులుగా రాష్ట్ర బీజేపీ నాయకులు ఇందులో పాల్గొంటున్నారన్నారు. గురువారం నిర్మల్ జిల్లాలో రైతులకు అండగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పలు కొనుగోలు కేంద్రాలను బీజేపీ నాయకులు సందర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలోనిమామడ, సోన్, దిలావర్పూర్, సారంగాపూర్ మండల కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శన చేస్తారని తెలిపారు.

### మద్యం వినియోగాన్ని తగ్గించడం & బరువు నియంత్రణ

మద్యం వినియోగాన్ని నియంత్రించడం మరియు శరీర బరువును అదుపులో ఉంచుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి అవసరం ఈ మార్పులను జీవితంలో ఆలస్యంగా ప్రారంభించినా కూడా వృద్ధాప్యంలో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.





## తొలి ప్రధాని నెహ్రూకు డిప్యూటీ సీఎం నివాళి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :**

దేశ తొలి ప్రధాని, నవ భారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రు 62వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని వ్యవసాయ ఆధారిత సమాజంగా కాకుండా పరిశ్రమలు సాంకేతిక విజ్ఞానంతో ఆధునిక భారతదేశ నిర్మించాలని ఆయన కలలుగన్నారని అన్నారు. భారీ ఆనకట్టలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఉక్కు కర్మాగారాలు, ఐఐటి, ఐఐఎం, అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థలు, స్పేస్ రీసెర్చ్ కి బలమైన పునాదులను నెహ్రూ వేశారని చెప్పారు. అణు శక్తి మిషన్ ను ఏర్పాటు చేసి దేశాన్ని అణు ఆయుధ సంపన్న దేశంగా మార్చేందుకు శక్తివంతమైన పునాదులను తొలి ప్రధాని నెహ్రూ వేశారని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి గుర్తు చేశారు. భిన్నత్వంలో ఏకత్వం ఇదే భారతీయత బలమని ఆయన బలంగా విశ్వసించారు. ఆ విలువలతోనే రాజ్యాంగ, న్యాయవ్యవస్థలను అనుసరించి బలమైన ప్రజాస్వామ్య దేశంగా భారత్ ను నిలిపారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు అమోఘం

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశ నిర్మాణంలో చేసిన సేవలు చిరస్మరణీయమని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 22వ వార్డు చౌరస్తాలో నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధికి నెహ్రూ బలమైన పునాదులు వేశారని తెలిపారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకీలం రాజేశ్వరరావు,మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ ఆలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపై వర్తక సంఘం రద్దు చేయాలంటూ ధర్నా

- **దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట వ్యాపారుల ఆందోళన**




**ముద్ర, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాని రద్దు చేసి టెండర్లు వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యాక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ సుమారు నెల రోజుల నుండి యాదగిరిగుట్ట లోని వివిధ పార్టీ ల నాయకులు, నిరుద్యోగులు కలిసి పోరాటం చేస్తున్న అధికారులు ప్రభుత్వం కనీస స్పందన లేదని, వాళ్లు ఇచ్చే డబ్బుల సంచులకు అమ్ముడుపోయినట్టు అనిపిస్తుందన్నారు. స్వచ్ఛందంగా చేస్తున్న పోరాటం చూసి మాజీ ఎంపీ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు. కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి టెండర్ వేయాలని తద్వారా దేవస్థానానికి 20 నుంచి 30 కోట్ల ఆదాయము సమకూరుతుందని, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించవచ్చని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, దేవపూజ అశోక్, బుగ్గా ఆంజనేయులు, కొన్నె సంజీవ, బండి అనిల్, ముక్కెర్ల వెంకటేష్, నర్సింహా, కర్రె ప్రవీణ్, మాటూరి బాలయ్య, మిర్యాల క్రిష్ణ, పల్లపు రవి, దార నవీన్, దొమ్మాట ప్రభాకర్, మందోజ్ నరేష్, వాల్మీకి అజయ్, సుధాగాని శివ, మెరుగు వెంకటేష్, కర్రె శ్యామ్, లక్ష్మయ్య, గుండు కుమార్, లింగాల వెంకటేష్, పులగం నరేష్, కాంటెకర్ శ్రవణ్, కారుమించి నాగేందర్ రెడ్డి, గడ్డమీది శ్రీకాంత్, శ్రీనాథ్, బుదారం రమేష్, గణేష్, సంతోష్ పాల్గొన్నారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

- **బక్రీద్‌కు గోవుల కుర్బానీ ఇవ్వవద్దు**

**ముద్ర, తుంగతుర్తి :**

బక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ముస్లింలు గోవులను కుర్బానీ ఇవ్వవద్దని నియోజకవర్గ మైనార్టీ సంఘం నాయకులు మొహమ్మద్ నసీరుద్దీన్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో గోవును కోట్లాదిమంది హిందువులు పవిత్రంగా గోమాతగా పూజిస్తారని అన్నారు, మతసామరస్యాన్ని కాపాడుకునేందుకు హిందువుల మనోభావాలను గౌరవిస్తూ బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను కుర్బాని ఇవ్వకూడదని మత పెద్దలు తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని అన్నారు, దేశంలో శాంతి సోదర భావం, సౌభ్రాతత్వం, నెలకొనాలంటే ప్రజలు ఒకరి మతాలను మరొకరు పరస్పరం గౌరవించుకోవాలని అన్నారు, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గోవును జాతీయ జంతువుగా ప్రకటించి చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు.

## పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలి

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

సాదా బైనమా, రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తులను, గ్రీవెన్స్ భూభారతి దరఖాస్తులు అన్నీ కూడా 15 రోజులలో పూర్తి చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వి సి హాల్ నుండి జిల్లాలోని తాసిల్దార్లు, ఆర్డీవోలతో వెబ్ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదా బైనమా, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను అలాగే గ్రీవెన్స్, భూభారతి లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా 15 రోజులలో పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని ధర్నా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**

పట్టణంలోని నల్గొండ చౌరస్తా నుండి హైదరాబాద్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని వివిధ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి శాసనసభ్యులు భువనగిరి పట్టణంలోని నల్గొండ చౌరస్తాకు మధ్యాహ్నం టైంలో విచ్చేసి రోడ్డు విస్తరణకు కొబ్బరికాయ కొట్టి జెసిబి తీసుకొని వచ్చి ఇండ్లను దగ్గర ఉండి కూలగొట్టడం మొదలుపెట్టడం అన్యాయమన్నారు. బాధితులకు ఎలాంటి సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా వారికి న్యాయం చేయకుండా వారితో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఇష్టారాజ్యంగా పనిని మొదలుపెట్టడాన్ని దారుణమన్నారు. ధర్నా సమయంలో మున్సిపల్ అత్యవసర సమావేశానికి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించిన కౌన్సిలర్లను అడ్డుకున్నారు. వారిని అడ్డుకోవడంతో ఒకింత గందరగోళం చోటుచేసుకుంది. వెంటనే పనులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కార్యకర్తలు బాధితులు పాల్గొన్నారు.

**రెండు దఫాలుగా రోడ్డు విస్తరణ : అత్యవసర సమావేశంలో కౌన్సిల్ ఆమోదం.**

భువనగిరి మున్సిపల్ పరిధిలోని నల్లగొండ చౌరస్తా నుండి హైద్రాబాద్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు రెండు దఫాలుగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ తెలిపారు. బుధవారం కౌన్సిల్ హాలులో చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి అధ్యక్షతన వైస్ చైర్పర్సన్ శ్రపోతంశెట్టి మంజుల, మున్సిపల్ కమిషనర్ కె.చంద్రప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక నల్లగొండ చౌరస్తా నుండి హైద్రాబాద్ చౌరస్తా వరకు 60 ఫీట్ల రోడ్డు పుణఃరుద్దరణలో భాగంగా సదరు ప్రతిపాదిత రోడ్డు చిన్నదిగా యుండడం వల్ల వాహనదారులకు, పాదాచారుల యొక్క రాకపోకలకు ఇబ్బంది కల్గుచూ, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుచూ తరుచుగా ప్రమాదాలు జరుగుచున్నందు వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురగుచున్నందున, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇట్టి విస్తరణ పుణఃరుద్దరణ పనులను రెండు దఫాలుగా అనగా మొదటి దఫా క్రింద నల్లగొండ చౌరస్తా నుండి ఎల్.బి. నగర్ చౌరస్తా వరకు, రెండవ దఫా క్రింద ఎల్.బి. నగర్ చౌరస్తా నుండి హైద్రాబాద్ చౌరస్తా వరకు ఫేజ్ 1, ఫేజ్ 2ల వారిగా ప్రజల సౌకర్యార్థం, వెసులుబాటు కొరకు చేపట్టుటకు గాను కౌన్సిల్ ముందు ప్రస్థావించగా కౌన్సిల్ ఆమోదించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమములో వార్డు సభ్యులు, కోఅప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





## మార్కెట్ల నుంచి ధాన్యాన్ని వెంటనే తరలించాలి

- **సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**



ప్రభుత్వాలకు ముందు చూపు లేకపోవడంతోనే మార్కెట్లలో ధాన్యం నిల్వ ఉంటుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. బుధవారం బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో పిఎసిఎస్ నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ మార్కెట్ కు ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు కాకపోవడంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అకాల వర్షాలతో మార్కెట్లో ఉన్న ధాన్యం తడిసి మొలకెత్తుతున్న పరిస్థితులు దాపురించాయని అన్నారు. ముఖ్యమంత్రి నుండి ఎమ్మెల్యే వరకు మాటలు చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలు కావడం లేదని అన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టుగా కాంటావేసి మిల్లులకు, గోదాములకు పంపిస్తే సమస్య ఉండదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్లు ఎన్ని రివ్యూ మీటింగ్ లు పెట్టినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తాను చేయాల్సిన పని చేయకుండా మార్కెట్లు సందర్శించడం, బాధ్యతా రాహిత్యంగా మాట్లాడడం రైతులను మోసం చేసినట్టే అవుతుందని అన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా ఏదితోస్తే అది మాట్లాడడం సరైంది కాదన్నారు. బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేసి రైస్ మిల్లర్లను సంతృప్తి పరిచినప్పటికీ పరిష్కారం కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. లారీ కాంట్రాక్టర్లతో ఎన్ని సమీక్షలు జరిపినా లారీల కొరత ఏర్పడుతుందని ఇది ప్రభుత్వం చేతగానితనమే అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి బండారు శ్రవణ్ కుమార్ నాయకులు గాడి శ్రీనివాస్, బండారు శ్రీరాములు, నిర్వాహకురాలు చింతల సంతోష, రైతులు కొండ శ్రీనాథ్ రెడ్డి, మంద యాదగిరి, మేకల అంజయ్య, చింతల అమృత, ఎదులాబాద్ మల్లేశ, మాదారం అంజయ్య, బర్ల శ్రీకాంత్, ఆకుల నరసింహ, జంగ బాలరాజు, నాశపోయిన సాయినాథ్ పాల్గొన్నారు.



## స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ కుటుంబ సభ్యులు

**ముద్ర, యాదగిరిగుట్ట :**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని బుధవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సతీమణి శుక్లా జానకి కుమార్తె నీతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మొదటగా ఆలయానికి వచ్చిన వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆలయ ఈవో భవాని శంకర్ ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరు వెంకటాచార్యుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా స్వామివారి లడ్డు ప్రసాదం అందజేశారు. ఆలయ అనుబంధం ఆలయమైన శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి ప్రణీత్ కుమార్ చార్యులు ఎస్పీఎఫ్ సిబ్బంది ఎం కృష్ణ శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

## ప్రభుత్వాలు వికలాంగుల హక్కులను కాలరాస్తున్నాయి

- **ఎన్పిఆర్ డి రాష్ట్ర అధ్యక్షుడు కురునేల్లి వెంకట్**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**

వికలాంగుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరస్తున్నాయని ఎన్ పిఆర్ డి రాష్ట్ర అధ్యక్షుడు కురునేల్లి వెంకట్ అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులు అమలు కావడం లేదని అన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్, మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపుకోసం వికలాంగులు ఎదురుచూస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. మే 29, 31 తేదీల్లో భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో వికలాంగుల చట్టలపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సురూపంగ ప్రకాష్, కార్యదర్శి వనం ఉపేందర్, కోశాధికారి లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, పాండాల శ్రీహరి పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి :**

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని 24 వ వార్డులోని అర్హులైన ప్రతి పేద ప్రజలకి అందే విధంగా చూస్తామని వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణా మల్లేష్ అన్నారు. పట్టణంలోని 24 వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిల్లల ఉపేందర్, బెంజారపు కరుణాకర్, యడమళ్ల సన్ని, ఎండి ఖలీల్, పర్సనబోయిన నాగయ్య, నల్లగుంట్ల బబ్లు,సోమని సైదులు, పర్సనబోయిన అంజయ్య, శివ,పోతన బోయిన శ్రవణ్, అల్లి మురళి, డీజే నరేందర్, వార్డు మహిళలు వార్డు ఆఫీసర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు ప్రక్రియను

## వేగవంతం చేయాలి

- **కలెక్టర్ అనురాగ్ జయంతి**


**ముద్ర, తుర్కపల్లి :**

ధాన్యం కొనుగోలు ప్రక్రియ ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం, తుర్కపల్లి మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారనీ, ఇంకా ఎంత ధాన్యం నిల్వలో ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుకు తూకం వేసిన ధాన్యానికి అనుగుణంగా సరిపడా లారీలు అందుబాటులో ఉన్నాయా లేదా అని అధికారులను ప్రశ్నించారు. ప్రతి రోజు కనీసం 4 లేదా 5 లారీల వరకు ధాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా నిరంతరం రవాణా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా తడిసిన ధాన్యం ఉన్నా కూడా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ధాన్యం విక్రయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పంట అవశేషాలను కాల్చొద్దు

- **భూమి ఆరోగ్యమే రైతు కుటుంబానికి భరోసా**
- **వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల**



**ముద్ర, ఖమ్మం :**

రైతు చెమటతో పుడుతున్న అన్నం సమాజానికి జీవనాధారం. అలాంటి రైతు భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమని రఘునాధపాలెం మండల వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల రైతులకు అవగాహన కల్పించారు. రఘునాథపాలెం మండలంలోని మల్లెపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల రైతులతో మమేకమై పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 28.05.2026
www.mudranews.in | @mudranews



**బలమైన సామాజిక సంబంధాలు:**



ఒంటరి తనానికి దూరంగా ఉంటూ, మంచి సామాజిక సంబంధాలను కలిగి ఉండటం వల్ల మానసిక ధైర్యం, తక్కువ ఒత్తిడి పెరుగుతాయి. ఇవి మెరుగైన మెదడు ఆరోగ్యానికి తోడ్పడటం ఇతరులపై ఆధారపడే పరిస్థితిని తగ్గిస్తాయి.

# ప్రతి ధాన్యం గింజనూ కొనాలి

**- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ఆంక్షలు లేకుండా ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజనూ కొనాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా లోని చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు గోనపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతులను కలిసి అధైర్యపడొద్దని, అండగా ఉండి కొట్లాడతామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనకపోవడం వల్లే ఆరుగాలం పండించిన పంట తడిసి ముద్దయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరించి రైతులను మోసపుచ్చుతూ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. వడ్లు, మక్కలు, సన్ ఫ్లవర్, శనగలు, జొన్నలు కొనమంటే కాంగ్రెస్ నాయకులు కేంద్రం మీద నెపం నెడుతున్నారన్నారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉండి కూడా బీజేపీ వాళ్లు ధాన్యం కొనాలని ఇక్కడ ధర్నాలు చేస్తున్నారన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగాయని ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ వాళ్లు రోడ్డెక్కుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సీఐ లెవీ, ఎరువుల కోటాను రాష్ట్రానికి సకాలంలో ఇవ్వకుండా మోసం చేస్తుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ రైతులను గాలికి వదిలేసి ఇద్దరూ కలిసి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎరువులకు, వడ్ల కొనుగోళ్లకు ఏనాడూ ఇబ్బంది రాలేదని గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్ కాళేశ్వరం జలాలతో బంగారం లాంటి పంటలు పండిస్తే, ఇవాళ్ల కొనేవాడు లేక ఆ పంట అమ్ముకోవడం రైతులకు కష్టమైపోయిందన్నారు. సాధారణంగా రోహిణి కార్తె నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయన్నారు. కానీ ఈ ప్రభుత్వం ఆన్ లైన్ ట్యాగింగ్, కొత్త రూల్స్ పేరుతో నెల రోజులు కాలయాపన చేయడం వల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొన్నామని ముఖ్యమంత్రి హైదరాబాద్ లో ఏసీ రూముల్లో కూర్చుని చెబితున్నారన్నారు. ఏ మార్కెట్ కి పోయినా ఇంకా సగం ధాన్యం కల్లా ల్లోనే ముగ్గుతోందన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీరు పడుతున్నారని చెప్పారు. తడిసిన ధాన్యం రేపటికల్లా మొలకలు వచ్చి పగిలిపోతాయన్నారు. వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి కలెక్టర్లు, తహసీల్దార్లు, డీఆర్డీఏ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు బస్తాకు 43 కిలోలు పెడితేనే దించుకుంటామని, లేకపోతే మిల్లుల దగ్గరకు రావొద్దని బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే మీరే మిల్లర్లతో మాట్లాడుకోండని చేతులెత్తేస్తున్నారని మండిపడ్డారు. ఏ-గ్రేడ్ వడ్లను కూడా బీ-గ్రేడ్ కింద రాస్తూ ఎకరాకు రూ. 6700, అలాగే క్వింటాల్ కు 3 నుంచి 5 కిలోల తరుగు పేరుతో మరో రూ. 3000.. వెరసి ఒక్కో రైతు రెండు రకాలుగా వేలాది రూపాయలు నష్టపోతున్నాడన్నారు.

రవాణా, హమాలీ, ట్రాక్టర్ల వెయిటింగ్ ఛార్జీలు, కాంటా డబ్బులు అన్నీ రైతుల నెత్తినే రు ద్దుతూ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తొలుత 90 లక్షల టన్నులు కొంటామన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పుడు 70 లక్షలే కొంటాననడం సిగ్గుచేటన్నారు. కేంద్రం కేవలం 51 లక్షల టన్నుల కోటానే ఇచ్చిందని ఆరోపించారు.

## బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి




**ముద్ర ప్రతినిధి, మెదక్:** బ్యాంకు రుణాలును సకాలంలో చెల్లించాలని డీఆర్డీఓ శ్రీనివాస్ రావు సూచించారు. మెదక్ వెలుగు మండల సమైక్య ప్రత్యేక సమావేశంలో జిల్లా అభివృద్ధి అధికారి (డీఆర్డిఓ) శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెదక్ మండలంలో గత సంవత్సరము చేసిన ప్రగతి నివేదికను చూసి గ్రామ సంఘ అధ్యక్షులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్ లో కూడా ఇదే విధంగా అన్ని లక్ష్యాలను పూర్తి చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్క గ్రామ సంఘంలో వివో బిల్డింగులు పనులపై వివో గ్రామ సంఘం అధ్యక్షురాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రస్తుతం రాయన్ పల్లి విలేజ్ లో బిల్డింగ్ మొత్తం పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మిగతా గ్రామాలలో స్లాబు, గోడలు పూర్తయినట్టు చెప్పారు. రెండు నెలలో పూర్తిచేసి ఉపయోగంలోకి తెచ్చుకోవాలని సూచించారు. గ్రామ సంఘం యొక్క నాయకత్వం గురించి వివరించి గ్రామ సంఘంలోని బుక్స్, సిబ్బందిపైన తనిఖీ ఉండాలన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు 100 శాతం చెల్లించే విధంగా చూడాలని, ప్రతి గ్రామ సంఘంలో ఎన్పిఏ అనే పదం ఉండొద్దన్నారు. మండల సమైక్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. నాగరాజు, సీసీలు శ్రీనివాస్ రెడ్డి, మహాలక్ష్మి , శివరంజని, సత్యం, శ్రీనివాస్, అకౌంటెంట్ మాధవి, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

## మెదక్ లో పోలీస్ భారీ ఫ్లాగ్ మార్చ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేసిన పోలీసులు బుధవారం సాయంత్రం మెదక్ పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫ్లాగ్ మార్చ్‌లో డిఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్ స్పెక్టర్ మహేష్, కృష్ణమూర్తి, శైలేందర్, రామకృష్ణ,పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజల్లో భద్రతా భావన కల్పించారు.మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ అంబేద్కర్ చౌరస్తా, రాందాస్ చౌరస్తా, పొట్టి శ్రీరాములు విగ్రహం, చమన్ ప్రాంతాల మీదుగా తిరిగి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. ఫ్లాగ్ మార్చ్ సందర్భంగా ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో పోలీసులు పహారా నిర్వహిస్తూ పరిస్థితులను సమీక్షించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలు శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. జిల్లాలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

## వన దుర్గా మాత సేవలో ఎమ్మెల్యే రోహిత్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని మాతను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తమ సతీమణితో కలిసి బుధవారం దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం అని తెలిపారు. వెంట మున్సిపల్ చై ర్మన్ లు కానుగు రాధికా భూతీరాజ్, లావణ్య, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భరత్ గౌడ్, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎంబీబీఎస్ లను సన్మానించిన ఎస్పీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండీ తాజుద్దీన్ కుమార్తెలు డా. సమీరా సహేతాజ్, డా. సానియా సహతాజ్‌లు ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. చిన్న గ్రామమైన చేగుంటలో జన్మించి, సాధారణ కుటుంబ పరిస్థితుల్లో పెరిగిన ఈ ఇద్దరు కుమార్తెలు స్థానిక పాఠశాలలోనే చదువుకుని, అనంతరం ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పరిమిత వనరులు ఉన్నప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగి విద్యను పూర్తిచేయడం ఆదర్శమన్నారు.

## ధాన్యం తరలింపు త్వరగా పూర్తి కావాలి

**- కలెక్టర్ హైమావతి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ధాన్యం తరలింపు త్వరగా పూర్తి కావాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో గల శివ సాయి బాలాజీ రైస్ మిల్, ముస్యాల గ్రామ శివారులోని శ్రీ రేణుక బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో ధాన్యం డౌన్ లోడ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులలో దాదాపు 30 వాహనాల ధాన్యం డౌన్ లోడ్‌కు తయారుగా ఉందని వాటిని యుద్ధ ప్రతిపాదకన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో స్థానికంగా పని చేసే హమాలీలను సమకూర్చుకుని ఎక్కడ కొనుగోలు కేంద్రాల్లో అక్కడ హమాలీలు పనిచేస్తే మిల్లులో దిగుమతికి ఆలస్యం కాదని ఈ బాధ్యతను, అలాగే ధాన్యం దిగుమతికి పలు గోదాములను అన్వేషణ చేయాలని, స్థానిక తహసీల్దార్ చూసుకోవాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి కాగానే మిల్లర్ అక్నాలెజ్మెంట్, ట్రక్ షిట్ జెనరేట్, ఓపిఎంఎస్ అప్లోడ్ పెండింగ్ ఉంచకుండా వెంటనే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..**

## మొక్కజొన్న కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** మొక్కజొన్న కొనుగోళ్ళు త్వరిత గతిన పూర్తి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. రాయికల్ వ్యవసాయ మార్కెట్లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం పరిశీలిచారు. ఈ సందర్భంగా తొందరగా మొక్కజొన్న ధాన్యం ను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడినా ఎమ్మెల్యే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తుందని మొత్తం మక్కాలను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, మొత్తం ధాన్యంను కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా, కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలం చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు స్థల పరిశీలన చేయడం జరిగిందని, త్వరలో చేపట్టనున్న పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపా యాలను సమగ్రంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం

**- రైతులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ భరోసా**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** వాతావరణ ప్రతికూల ప్రభావంతో అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని కలెక్టర్ కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, జిల్లాలోని తహసీల్దార్లు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో కలిసి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నాలుగు వేల క్వింటాళ్ల ధాన్యం తడిసినట్లు పేర్కొన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. కుల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, శంకరంపేట,(ఏ) మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదయిందన్నారు. ఈ మండలాల్లోని ధాన్యం తడిచినట్లు వివరించారు. తడిసిన ధాన్యానికి కొనుగోలు చేసే విధంగా బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 59 వేల 227 మంది రైతుల నుంచి 2,76,776 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. 39,879 రైతులకుగాను 441.15 కోట్ల రూపాయలు అకౌంట్లోలో జమ చేశామన్నారు. 18 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తిచేసినట్లు ఆమె తెలిపారు.

ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు రమాదేవి, జైచంద్రారెడ్డి, రామకృష్ణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యానంద్, జగదీష్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com